

# నీవు వచ్చేవనీ...నీ పిలుపేవిని

## – విజయరాణి కోడూరి

### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో సాధారణ బహుమతి పొందిన నవల

(గత సంచిక తరువాయి)

"**ఈ పూలు నాకు చాలా ఇష్టం**.. అయినా నీకెలా తెలుసు హేమ్?" అని అడిగాను.

"నిన్ను మొదటిసారి రాగింగ్ అపుడు చూశాను. అపుడు అనిపించింది సంపెంగి పూవులా ఉన్నావని" అన్నావు.

అతడి వేళ్ళు మరో పేజీని తిప్పాయి –

హేమ్, నీ నోటినుంచి వచ్చిన ప్రతి మాటను నా మనసు దాచుకుంది. ఏది తలుచుకుంటే అది క్లిక్ చేసినట్టు కళ్ళముందుకు వస్తుంది హేమ్.

ఎన్నో సందర్భాలలో అనేదాన్ని 'మీరు నాకు అర్థం కారు  అని నువ్వు, నేను 'మీరు..' అనగానే అనేవాడివి.

"మీరు నాకు అర్థంకారు. ఇదేగా అంటావ్" అని.

అపుడు ఏదో అనేసి వుండొచ్చు నేను. కాని ఇపుడు నువ్వు నిజంగా అర్థం కావటంలేదు హేమ్."

అక్కడ అక్షరాలు నీళ్ళు పడినట్లు చెరిగిపోయాయి. బాధగా ఆ అక్షరాలను పెదవులతో తాకాడు.

కళ్ళు ఒత్తుకుని మరో పేజీ తిప్పాడు అతడు.

నన్ను అరకు వేలీకి తీసుకెళ్ళావు. అది మరుపురాని రోజు.

"అంత స్పీడ్ ఎందుకు హేమ్, స్లోగా వెళ్ళొచ్చుగా" అన్నాను.

"అమ్మాయిగారు చీర కట్టుకున్నప్పుడు, ఎక్కడ పక్కకు జారిపోతావోనని స్లోగా వెళ్ళేవాడిని. ఇప్పుడు డ్రెస్ కదా, హాయిగా కూర్చోవచ్చు. పడిపోయే ఛాన్సే వుండదు మేడం" అన్నావు.

అరక్ వేలీలో, ఆ కొండలు, లోయలు, గుహలు అన్నీ మనవేనన్నట్టు తిరిగాం. నిజంగా అంత సంతోషాన్నెప్పుడూ చవిచూడలేదు నా మనసు.

అపుడు నువ్వు అడిగావ్ నన్ను "మీ నాన్నగారు మన పెళ్ళికి ఒప్పుకోకపోతే?" అని.

"నా సంతోషమే ఆయనకు చాలా ముఖ్యం. చాలా మంచి వ్యక్తి. ఒప్పుకుంటారు హేమ్."

"నాన్నగారు ఒకసారి రమ్మంటున్నారు."

"ఏం చెప్తావ్?"

"ఏం చెప్పమంటావ్?"

"నీకు తెలియదా?"

"ఉన్నదే చెప్తాను, ఇక్కడ లత అని ఒక సంపంగి పువ్వు ఉంది. పెళ్ళి చేసుకోమంటారా? మీరు వద్దంటే మానేస్తాను. మీకు నచ్చిన అమ్మాయిని చూడండి అని."

నిన్ను ఒక చెట్టు కొమ్మ తీసుకుని తరిమి తరిమి కొట్టాను.

"సరదాకి అన్నాను" అని బ్రతిమలాడావు.

"అలా అనకు హేమ్. తథాస్తు దేవతలు ఉంటారట. అమ్మ చెప్పింది" అన్నాను.

ఒకవేళ సినిమాలలోలాగ, మరొక అమ్మాయిని చేసుకోవలసి వచ్చిందా? నీ గురించి అలా ఆలోచించనివ్వటం లేదు నా మనసు. అలా జరగలేదు కదూ.. ప్లీజ్. మరి ఏమైంది? నీ మౌనానికి అర్థం ఎలా వెతుక్కోగలదు అలిసిన నా మనసు?

హేమ్ తొందరగా వచ్చి నన్ను నీ దగ్గరకు తీసుకో. నీ స్పర్శ కోసం నా మనసు తపిస్తుంది. ప్లీజ్ హేమ్ త్వరగా రా. నా ఓపిక అయిపోతుంది ఈ నిరీక్షణలో...

మరో పేజీ

ఆ రోజు ఆదివారం. నువ్వు నెక్స్ట్ వీక్ ఆగ్రాకు వెళ్ళాలి. అమ్మా, నాన్నగారు చూడాలనుంది అంటున్నారు అన్నావు. నువ్వు సౌదీ అరేబియాలో వార్ టైములో వారు ఎదుర్కొన్న కష్టపరిస్థితుల గురించీ, వారి ఫ్యామిలోనుండి ఎదుర్కొన్న సమస్యల గురించి చెప్పావ్.

పుస్తకాన్ని మూసి గుండెపై ఉంచుకున్న అతడు కంటి కొనలనుండి కన్నీళ్ళు కారుతున్నాయి. అతడి మనసు దారి తప్పిన బిడ్డలా దుఃఖిస్తుంది 'లతా..లతా ' అంటూ.

ఆ దుఃఖం మాటున దాగి వున్న గతపు స్మృతులను వెతికి తెచ్చుకుంది అతడి మనసు. ఇద్దరూ కలిసి గడిపిన ప్రతిక్షణం, మాట్లాడుకున్న ప్రతి మాట, ప్రతి అనుభుతిని మనసు మౌనంగా రోదిస్తూ అతడికి గుర్తు చేస్తుంది.

"హేమ్, నువ్వు ఆగ్రాకు వెళ్ళాలి అంటున్నావ్. నువ్వు తిరిగి వచ్చేవరకు నేను ఒంటరిగా ఉండగలనా అనిపిస్తుంది" అంది లత.

"మాగ్జిమమ్ ఒక వారం అమ్మా. అంతే" అన్నాడు.

"వారమా, అంటే ఏడు రోజులు..."

"గంటలూ, నిమిషాలు కూడా లెక్కపెట్టక్కర్లేదులే. నువ్వు తయారై క్రిందకు రా, నేను హాస్టల్ దగ్గరకు వస్తున్నా" చెప్పాడు హేమంత్.

హేమంత్ వెళ్ళేసరికి అతడికి ఇష్టమైన చీర కట్టుకుని తయారై ఎదురు చూస్తుంది లత.

"కమాన్ లతా, క్విక్" అన్నాడు.

వెళ్ళి బైక్ ఎక్కి కూర్చుంది.

"హేమ్, ఇదేంటి శారీ గార్డ్ వుంది? బ్రహ్మచారి బండీ ,అదీ అన్నావు."

"అన్నాను. కాని ఒప్పుకున్నాక తప్పుతుందా?

"ఇదే మరి, అర్థం కావు అనేది."

"ఇంకెక్కడి బ్రహ్మచారి? నన్ను కట్టి పడేసావుగా."

"నేనా? ఎక్కడ పడేసాను?"

"చెప్పాలా అది కూడా. నీ మనసులో బంధించేసావు కదా!"

"మంచి ప్లేసేగా, ఎంతకాలమైనా హాయిగా ఉండవచ్చు" అంటూ నవ్వింది.

బైక్ ఆగింది. చూట్టూ చూసింది లత.

ఒక పెద్ద బిల్డింగ్ అది. వాచ్‌మన్ పరుగున వచ్చి గేటు తీశాడు.

"రండి సార్, మీ మామయ్యగారు ఎదురు చూస్తున్నారు" అన్నాడతడు.

నెమ్మదిగా మెట్లెక్కి లోపలకు వెళ్ళారు.

ఈజీ ఛైర్‌లో పడుకుని పేపర్ చదువుకుంటున్నాడు హేమంత్ మేనమామ గోపాల్.

"మామయ్యా" అనగానే ఉలిక్కిపడి చూసాడు గోపాల్. లేచి వచ్చి మేనల్లుడిని దగ్గరకు తీసుకున్నాడతడు.

"మామయ్యా, తను లత. నాకు జూనియర్."

"లతా, ఆయన మా అమ్మకు తమ్ముడు, మామయ్య" అంటూ పరిచయం చేశాడు హేమంత్.

"అమ్మా ఇందిరా, హేమంత్ వచ్చాడు" అంటూ కేక వేసాడు ఇంట్లోకి.

"మామయ్యా, సునీల్ బిజినెస్ బాగానే చూసుకుంటున్నాడా?"

"బాగానే చూసుకుంటాడురా. మంచివాడే, ఇప్పటివరకు బ్యాడ్ హాబిట్స్ ఏం లేవు. కూర్చోమ్మా" అంటూ లతకు కుర్చీ చూపించాడతడు."

"ఆ మామయ్యా, పిన్నీ బాబాయి లేరా?"

"ప్రభావతి గుడికి వెళ్ళిందిరా. వస్తూ వుంటుంది ఈపాటికి."

"ఆలోగా పైకి వెళ్ళి ఇల్లు చూపిస్తాను తనకు."

"ఇందిర స్నానం చేస్తున్నట్టుంది హేమంత్. మీరు వెళ్ళండి పైకి" అన్నాడు గోపాల్.

మెట్లు ఎక్కి పైకి వెళ్ళారు.

"ఈ ఫ్లోర్‌లో మా మమ్మీ సిస్టర్, అంటే మా పిన్ని ఫ్యామిలీ ఉంటుంది. క్రింద మామయ్య ఫ్యామిలీ ఉంటారు.

మెట్లు ఎక్కి పై అంతస్తులోకి వెళ్ళారు. తలుపు బయటే గెడపెట్టి వుంది. తలుపు ఓపెన్ చేసి ఫ్యాన్ ఆన్ చేశాడు హేమంత్.

"రా లతా!" అంటూ చెయ్యి పట్టి లోపలకు తీసుకెళ్ళాడు.

"ఇక్కడ మమ్మీ, డాడీ వచ్చినపుడు ఉంటాం."

"హేమంత్, మరి మీరు ఉండేది ఇక్కడేనా?" చుట్టూ చూస్తూ అడిగింది.

"అపుడపుడు. అరుణ్, నేనూ కలిసి బయట ఒక అపార్ట్‌మెంట్‌లో ఉంటాం."

"అలాగా" అంటూ ఎదురుగా ఉన్న ఫ్రిజ్ దగ్గరకు నడిచింది లత.

"వాటర్ కావాలా?" అంటూ ఫ్రిజ్ డోర్ ఓపెన్ చెయ్యబోయాడు హేమంత్.

"వద్దు" అంది ఫ్రిజ్‌పై ఉన్న ఫ్రేమ్ లో ఫోటోను తదేకంగా చూస్తూ.

"మీ మదర్, ఫాదర్ కదా" అడిగింది లత.

"అవును" అన్నాడు.

"హేమ్ గారికి ఇద్దరి అందంవచ్చింది. యు లుక్ హ్యాండ్‌సమ్" అంది అతడి క్రాఫ్‌ను అటు ఇటు కదిలించి ముఖంలోకి చూస్తూ.

"అవునా? ఇంత లేట్‌గా గుర్తించేవా?" నవ్వుతూ అడిగాడు.

"ఎపుడో గుర్తించాం. అందుకే మరి" అంటూ నవ్వేసింది.

"అందుకే మరి. తర్వాత ఏంటి చెప్పు" అన్నాడు ఆమెను తనవైపు తిప్పుతూ.

"అందుకే మరి మాయలోపడిపోయింది లత" అతడి నుంచి దూరంగా జరుగుతూ అంది.

"ఎవరి మాయలో ఎవరు పడ్డారో తర్వాత తీరికగా తేల్చుకుందాం" అంటూ ఆమెను దగ్గరకు తీసుకుని కళ్ళలోకి చూస్తూ చిలిపిగా అన్నాడు. పచ్చగా ఉన్న లత బుగ్గలు గులాబీ రంగును పులుముకున్నాయి.

"హేమ్" అంటూ అతడి గుండెపై తల వాల్చింది లత.

ఆమె ముఖం పైకి ఎత్తి చూసిన హేమంత్" ఏయ్ ఎందుకు ఈ కన్నీళ్ళు?" అన్నాడు.

"ఏం లేదు హేమ్" అంటూ దూరంగా జరిగింది ఆమె. తిరిగి అంది

"నిన్ను వదిలి ఉండలేక పోతున్నాను హేమ్. నీతో కలిసి ఉన్నంతసేపు నన్ను నేను మరచిపోతాను. నువ్వు వెళిపోతే, నిన్ను మరువలేక మధన పడతాను. ఎన్నిసార్లో అనుకుంటాను  ఇద్దరం కలిసి ఉండే రోజు ఎపుడు వస్తుందోనని."

"హు!" భారంగా నిట్టూర్చాడు హేమంత్ కర్చీఫ్‌తో ఆమె కళ్ళు ఒత్తుతూ.

"నీకు ఎగ్జామ్స్ లేకపోతే, నిన్నూ నాతో ఆగ్రాకు తీసుకువెళ్ళేవాడిని. లతా.. ప్లీజ్ అనవసరపు దిగులుతో టైమ్ వేస్ట్ చెయ్యకుండా బాగా చదువు. ఎగామ్స్ కు ప్రిపేర్ అవు. మనం ఒక లక్ష్యంతో చదువుతున్నాం మెడిసిన్. ప్లీజ్ లతా, నాకూ ఉన్నాయి నీలాంటి ఫీలింగ్స్. కాని అవి మనని లక్ష్యానికి దూరం చెయ్యకూడదు."

"అవును" అంది తల వాల్చి.

"ముఖం కడుక్కుని రిఫ్రెష్ అవు. పిన్ని వస్తుంది" అంటూ వాష్ బేసిన్ వరకూ తీసుకువెళ్ళాడు.

పైట కొంగుతో ముఖం తుడుచుకుంటూ వచ్చింది లత. తననే గమనిస్తున్న హేమంత్ వైపు చిరునవ్వుతో చూసింది.

"పైన టెర్రస్ మీదకు వెళ్దామా?" అడిగాడు.

"ఊ" అంది. ఆమెకు అతడితో కలిసి గడుపుతున్న సంతోషంకన్నా, కాసేపట్లో మళ్ళీ తనను హాస్టల్ దగ్గర వదిలి వెళ్ళిపోతాడు అన్న దిగులు ఎక్కువగా వుంది.

లత భుజం చుట్టూ చెయ్యివేసి మెట్లెక్కుతున్న హేమంత్ అలికిడికి వెను తిరిగి చూసాడు.

మామయ్య కూతురు ఇందిర మెట్లు దిగి వెళ్ళిపోతూ కనిపించింది. డాబా అంతటా రకరకాల పూల మొక్కలతో, దూరంగా కనిపిస్తున్న సముద్రపు అలలతో ఆహ్లాదకరంగా వుంది.

"వావ్! ఇన్ని రకాల పూలమొక్కలా! చాలా బాగుంది ఇక్కడ కూర్చుని ప్రశాంతంగా చదువుకోవచ్చు" అంది లత సంతోషంగా.

"చదువుకోవటానికి మాత్రమేనా?" అన్నాడు ఆమెను దగ్గరకు తీసుకుంటూ. అతడి చూపులను తట్టుకోలేని ఆమె కళ్ళు అరమోడ్పులయ్యాయి. ఆమె నుదుటిపై పెదవులతో తాకాడు అతడు సుతారంగా.

"టు డే యు లుక్ సో బ్యూటిఫుల్" అంటూ.

అతడి భుజంపై తల వాల్చింది ఆమె. కదలికలు ఆమె దుఃఖిస్తుంది అని చెప్తున్నాయి అతడికి.

"ఏయ్ ఏమైంది లతా?" అంటూ దూరంగా జరిపి ఆమె ముఖంలోకి చూశాడు హేమంత్.

"ఈ కన్నీళ్ళెందుకు లతా?" విస్మయంగా అడిగాడు. దగ్గరకు తీసుకుని తల నిమురుతూ ఉండిపోయాడు. నెమ్మదిగా కర్చీఫ్‌తో కళ్ళు ఒత్తాడు.

"ఏమైంది?" ఆమె ముఖం పైకెత్తి కళ్ళలోకి చుస్తూ అడిగాడు.

"ఎందుకో అలజడిగా వుంది హేమ్."

"ఎందుకు?"

"నువ్వు ఆగ్రా వెళ్ళిపోతావ్. నీకు ఏడు రోజులే కావచ్చు. కాని నాకు ఏడుజన్మలు లా అనిపిస్తుంది. మళ్ళీ ఎప్పుడు కలుస్తాం? అదే బెంగగా వుంది."

ఆమెను గుండెకు హత్తుకున్నాడు. అప్రయత్నంగా అతడి కళ్ళు కూడా చెమ్మగిల్లాయి.

"ఇలా కూర్చో లతా" అంటూ అక్కడ వున్న ఉయ్యాలపై కూర్చోపెట్టాడు.

"పసిపిల్లలు ఏడుస్తుంటే ఇలా ఉయ్యాలలో వేసి ఊపుతారు, కదూ" అంటూ తనూ ఆమె పక్కన కూర్చున్నాడు. పాదాలతో నేలను తాకుతూ ఉయ్యాలను ఊగేలా చేశాడు.

"నిన్ను ఇక్కడకు ఎందుకు తీసుకు వచ్చానో తెలుసా? మా పిన్నికి పరిచయం చేద్దామని. చిన్నప్పుడు ఆమె దగ్గరే పెరిగాను. ఈ వారం రోజులూ, కావాలంటే నువ్వు ఇక్కడ పిన్నితో ఉండవచ్చు. మా డాడీకి కుటుంబం అంటే, అందరూ కలిసి ఉండాలన్న కోరిక. అందుకే ఈ బిల్డింగ్‌ను అందరికోసం తీసుకున్నారు. ఇపుడు నువ్వు కూడా ఈ ఫ్యామిలీలో మెంబర్‌వే కదా లతా" అన్నాడు.

లత ఒక్కసారిగా అతడిని లతలాగే పెనవేసుకుంది

"నువ్వు ఎన్ని చెప్పినా, లోలోపల ఏదో భయంగా వుంది హేమ్. మళ్ళీ ఎప్పుడు కలుస్తామన్న దిగులు మనసులో"

"అయితే ఒక పనిచేస్తాను లతా నీకు ఇష్టమో, కాదో చెప్పు. నీ ఎగ్జామ్స్ అయిపోగానే మ్యారేజ్ అరేంజ్‌మెంట్స్ చెయ్యమని అడుగుతా అమ్మను, నాన్నగార్నీ. నువ్వు నీ వైపునుండి మీ ఫాదర్ ఒప్పుకునేలా చూసుకోమరి."

దూరంగా జరిగింది అతడి చుట్టూ అల్లుకుని ఉన్న చేతులను వెనక్కు తీసుకుంటూ.

"సరే హేమ్. కాని ఇది నువ్వు నిజంగానే చెప్తున్నావా?" అడిగింది.

"ఎందుకా డౌట్ నీకు? నిజగానే చెప్తున్నా."

"ఊ." అంది.

"నేను వెళ్ళటానికి. ఇంకా నాలుగు రోజులుందిగా."

"అవునుగా" అంది.

"ఇదిగో చెప్తున్నాను, నువ్వు అలా చూడకు. నాకు మనశ్శాంతిగా ఉండదు వెళ్ళినా."

బలవంతంగా నవ్వు తెచ్చుకుంది ముఖం మీదకు. "అలాగే హేమ్" అంది.

"రేపు రోజంతా నీతోనే వుంటాను. మార్నింగ్ సెవెన్‌కు రెడీ అయి ఉండు, వస్తాను నేను" అన్నాడు.

"ఇపుడు చాలా హ్యాపీగా వుంది" అంది అతడి మెడ చుట్టూ చేతులు వేస్తూ.

"ఉంటుంది. ఎందుకుండదూ" అన్నాడు ముక్కుపట్టి చిన్నగా ఆడిస్తూ.

"అన్నయ్యా" అన్న పిలుపుతో వెను తిరిగి చూశాడు హేమంత్.

"రా అమ్మా స్వర్ణా" అన్నాడు. లత కొంచెం దూరంగా జరిగి నిలబడింది.

"అమ్మ కిందకు రమ్మంటుంది" అంటూ వచ్చినంత వేగంగాను వెళ్ళిపోయింది స్వర్ణ.

లతను ప్రభావతికి పరిచయంచేశాడు. ఆమె పాదాలను తాకి దణ్ణం పెట్టింది లత.

"పిన్నీ ఇందిర ఏది? పిలువు స్వర్ణా" అన్నాడు.

"ఇందిరకు ఈ సంవత్సరంతో బిటెక్ అయిపోతుంది.

మంచి సంబంధం చూసి పెళ్ళి చేస్తానంటున్నాడు గోపాల్."

"అన్నయ్యా ఇందిర రాదట" అంటూ వచ్చింది.

"రావటంలేదా? అదేంటి? నువ్వు కూర్చో లతా, ఇపుడే వస్తాను" అంటూ మెట్లు దిగి కిందకు వెళ్ళాడు హేమంత్.

"మామయ్యా, ఇందిర ఏది?"

"లోపలుందిరా" అన్నాడు గోపాల్.

"ఇందూ" అంటూ పిలిచాడు. ఆమె పలుకక పోయేసరికి నెమ్మదిగా లోపలకు వెళ్ళాడు హేమంత్.

మంచంపై తలగడలో తలదాచుకుని ఏడుస్తున్న ఇందిరను చూసి వేగంగా దగ్గరకు వెళ్ళాడతడు.

"అత్తయ్యా ఏమైంది? ఎందుకు ఏడుస్తుంది?"

"దాని మూడ్ ఎందుకో బాగోలేదు అంతే. నువ్వు వెళ్ళు" అంది గౌతమి.

"నాకు కారణం తెలియాలి కదా అత్తయ్యా. ఇందిర ఇంకా పై చదువులకు వెళ్దాం అనుకుంటుందా, యు ఎస్‌కు పంపిస్తాను. తన బాధేంటో తెలుసుకోకుండా ఎలా వెళ్ళిపోగలను? అందరం కలిసి పెరిగిన వాళ్ళు. తనను కారణం అడిగి తెలుసుకుని సాల్వ్ చెయ్యకుండా వెళ్ళిపోతే నాకు మనశ్శాంతి ఉండాలిగా" అంటూ మళ్ళీ ఇందిర దగ్గరకు వెళ్ళాడు హేమంత్.

ఆమెను బలవంతంగా లేవదీసి కూర్చోపెట్టాడు.

"నీకు ఏమైంది ఇందూ? ఏం కావాలి? చెప్పందే నాకు ఎలా తెలుస్తుందమ్మా?" ఇందిర కళ్ళు కర్చీఫ్‌తో ఒత్తుతూ అడిగాడు.

"బావా నేను అడిగింది నువ్వు ఇవ్వలేవు అని అర్ధమైంది నాకు. అందుకే నీకు చెప్పను. ప్లీజ్ వెళ్ళిపో" ముఖాన్ని చేతులలో దాచుకుంది ఇందిర.

గౌతమి వచ్చింది చేతులు పైట కొంగుకు తుడుచుకుంటూ.

"నువ్వైనా చెప్పు అత్తయ్యా" బాధగా అడిగాడు హేమంత్.

"ఏముంది హేమంత్? పిచ్చిపిల్ల నీమీద ఆశలు పెంచుకుంది" అంది గౌతమి కూతురు దగ్గర కూర్చుంటూ.

"ఏంటి?" విస్మయంగా బిగ్గరగా అన్నాడు.

"తప్పేముందిరా అలా నిర్ఘాంతపోవటానికి? నీకు వరసైనదేగా. అదేకాదు రా హేమంత్. నిన్ను అల్లుడిగా చేసుకోవాలని నేనూ ఆశపడ్డాను" గోపాల్ అన్నాడు.

"తప్పే మామయ్యా! సునీల్, ఇందిర, స్వర్ణ, సంతోష్, నేను అందరం కలిసే పెరిగాం కొంతకాలం" నాకు అందరూ నా తోబుట్టువులుగానే అనిపిస్తారు. ఇందిరను ఆ దృష్టితో చూడలేను నేను.  చూడలేదు కూడా."

"అవునురా మాదే తప్పు" అన్నాడు గోపాల్ నిష్టూరంగా.

గోపాల్‌కు దగ్గరగా వెళ్ళాడు హేమంత్.

"మామయ్యా, నువ్వంటే నాకు ఎంతో గౌరవం. నన్ను క్షమించు. ఇందిరకు మంచి సంబంధం చూసి పెళ్ళి చేద్దాం. దయచేసి నన్ను అర్థం చేసుకోండి."

"సరే లేరా అర్థం అయింది మాకు ఈరోజే. అమ్మా, నాన్నల దగ్గరకు వెళ్తున్నావటగా. వాళ్ళని అడిగాం అని చెప్పు. జాగ్రత్తరా హేమా" అంటూ హేమంత్‌ను  దగ్గరకు తీసుకున్నాడు గోపాల్.

చెమ్మగిల్లిన మేనమామ కళ్ళను చూసి హేమంత్ మనసు బాధకు గురైంది.

ఇందు గదిలోకి వెళ్ళి తలుపులు మూసుకుంది.

"అత్తయ్యా, నీకూ నామీద కోపంగా ఉందా? నన్ను క్షమిచండి దయచేసి" అంటూ గౌతమిని సమీపించాడు.

"లేదు బాబూ. మాకు మీమీద కోపం రాకూడదు. మాకోసం బ్రతకటానికి ఇంత సౌకర్యం కల్పించారు మీ అమ్మా, నాన్నా. అదే చాలు మాకు. అయినా ఎవరి జీవితాలు వాళ్ళవి" అంటూ లోపలకు వెళ్ళిపోయింది ఆమె.

హేమంత్ మనసులో ముల్లు నాటుకున్నంత బాధగా వుంది. అతడి ముఖం గంభీరంగా మారింది. గమనించిన ప్రభావతి, "కాసేపు కూర్చోరా హేమంత్. వెళ్దురుగాని" అంది.

"లేదు పిన్నీ పని ఉంది నాకు, వెళ్ళాలి. పిన్నీ ఒకసారి నీతో మాట్లాడాలి, ఇలా వస్తావా?" అంటూ పైకి వెళ్తాడతడు.

వెళ్తూ "లతా అయిదు నిముషాలు కూర్చో" అని చెప్పి వెళ్ళాడు.

ప్రభావతి వెళ్ళి కూర్చుంది "ఏం మాట్లాడాలి?" అసలు అలా   వున్నావేంటి హేమంత్? ఏం జరిగింది?" అడిగింది ఆత్రంగా.

"పిన్నీ ఆ అమ్మాయి పేరు లత. నాకు జూనియర్, నేను ఆమెను వివాహం చేసుకోవాలనుకుంటున్నాను. వాళ్ళ పేరెంట్స్ కాదనరు. ఇష్టపడతారు అని చెప్పింది. నేను ఆగ్రాకు వెళ్తున్నాను కదా. అమ్మకీ నాన్నగారికీ చెప్తాను."

"చాలా సంతోషం హేమంత్. అమ్మాయి బాగుంది. పెద్దలంటే గౌరవం ఉంది. చేసుకుని సుఖంగా ఉందువుగాని. మీ అమ్మకు, అభిగారికి మేము ఏమిచ్చి రుణం తీర్చుకోగలం. ఏదో బ్రతికేస్తున్న మాకు ఇంత వైభోగంగా బ్రతికే అవకాశం కల్పించారు."

వద్దు పిన్నీ, అలా మాట్లాడవద్దు  దయచేసి. మనం అందరం ఒకటే. సంతోష్ చదువెందుకు మానేసాడు? ఇపుడేం చేస్తున్నాడు వాడు?"

"వాడు సావసాలతో అలా తయారయ్యాడు. బెట్టింగులు, పేకాట కోడి పందాలులాంటివే వాడి జీవితం. వాడి చేతికేం డబ్బులివ్వకు. చూద్దాం మారతాడేమో?" బాధగా చెప్పింది ప్రభావతి.

"సునీల్ చేసే ట్రాన్స్‌పోర్ట్ బిజినెస్‌లో ఉండొచ్చుగా. ఎంతో కొంత వస్తుందిగా సంతోష్‌కు కూడా.

"వాడు వినడు అన్నయ్యా. నీకే కొంచెం భయపడతాడు. చెప్పు ఎప్పుడైనా" స్వర్ణ చెప్పింది.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS